సమర్థవంతంగా విద్యుత్ సరఫరా

• వేసవి డిమాండ్‌ను చేరుకునేలా పటిష్ట చర్యలు

అమరావతి, ఆంధ్రప్రభ : రాష్ట్ర విద్యుత్ రంగాన్ని మరింత పటిష్టపర్చడంతోపాటు భవిష్యత్తులో పెరుగుతున్న విద్యుత్ డిమాండ్‌ను తీర్చడానికి రాష్ట్రప్రభుత్వం కట్టుబడి ఉందని విద్యుత్ శాఖా మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రా రెడ్డి స్పష్టం చేశారు. రాష్ట్రంలో పెరుగుతున్న విద్యుత్ డిమాండ్, ఇతర విద్యుత్ శాఖాపరమైన అంశాలపై శుక్రవారం ఆయన అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ, మునుపెన్నడూ లేని విధంగా రాష్ట్రంలో ఉష్ణోగ్రతల్లో గణనీయమైన పెరుగుదల ఉన్న నేపథ్యంలో విద్యుత్ రంగం ఎదుర్కొనే సవాళ్లను పరిష్కరించడం రాష్ట్ర ప్రభుత్వం ముందున్న తక్షణ కర్తవ్యమన్నారు. అందులో భాగంగానే 24/7 నాణ్యమైన మరియు నమ్మకమైన విద్యుత్ సరఫరాను అందించడానికి నిర్విరామ కృషి చేస్తోందని చెప్పారు.

ఈనెల 18న రాష్ట్రంలో 12,653 మెగా వాట్ల గరిష్ట డిమాండ్‌తో 251 మిలియన్ యూనిట్ల మేరకు మునుపెన్నడూ లేని విధంగా అత్యధిక ఇంధన డిమాండ్‌ను విద్యుత్ సంస్థలు విజయవంతంగా తీర్చాయని తెలిపారు. ప్రస్తుత వేసవి పరిస్థితుల దృష్ట్యా రాష్ట్రంలో విద్యుత్ వినియోగం ఎంత పెరిగినా దానిని ఎదుర్కొనేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి స్పష్టం చేశారు. ప్రజల సంక్షేమం మరియు ఆర్థికాభివృద్ధి కోసం విద్యుత్ రంగాన్ని బలోపేతం చేయడం తమ ప్రభుత్వ విధివిధానాల్లో భాగమన్నారు. రాష్ట్రంలోని ప్రతి ఇంటికీ అత్యంత నాణ్యమైన, విశ్వసనీయతతో 24/7విద్యుత్‌ను అందించాలని ముఖ్య మంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి చాలా ఆసక్తిగా ఉన్నారని చెప్పారు.

ఆర్థిక ప్రగతికి సంకేతం

ఇంధన వినియోగం పెరగడం రాష్ట్ర ఆర్థిక ప్రగతికి సంకేతమన్నారు. ఉదాహరణకు, వైజాగ్ నగరంలోనే 2018-19లో 6696 ఎంయూ ఉన్న విద్యుత్ డిమాండ్ 2021-22లో 8164 ఎంయూకి పెరిగిందని, ఇది ఇంధన వినియోగంలో 22 శాతం పెరుగుదలను నమోదు చేసిందని చెప్పారు. డిమాండ్ పెరుగుదల విశాఖపట్నంలో పెరుగుతున్న ఆర్థిక కార్యకలాపాలను స్పష్టంగా చూపిస్తుందన్నారు.

పెరుగుతున్న విద్యుత్ డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని విద్యుత్ ఉత్పత్తి కోసం థర్మల్ పవర్ ప్లాంట్‌లకు బొగ్గు సరఫరాను మెరుగుపరచడానికి కేంద్ర బొగ్గు మరియు రైల్వే మంత్రిత్వ శాఖతో విద్యుత్తు సంస్థలు నిరంతరం కృషి చేస్తున్నాయని ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె విజయానంద్ మంత్రికి వివరించారు. విద్యుత్ సరఫరాలో అంతరాయాలు తలెత్తకుండా డిస్కమ్‌లు కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నాయని, విద్యుత్ సరఫరా సమస్యలు తలెతకుండా అప్రమత్తంగా ఉన్నాయని తెలిపారు. థర్మల్ పవర్ ప్రొడక్షన్ ప్రాజెక్టులు, గ్రీన్ ఎనర్జీ ప్రాజెక్టులు, పవర్ నెట్‌వర్క్ పటిష్ట కార్యకలాపాలు మొదలైన వాటి నుండి సమర్థవంతమైన అవుట్‌పుట్‌ను వేగవంతం చేయడానికి ఏపీ విద్యుత్తు సంస్థలు అన్ని ప్రయత్నాలు చేస్తున్నాయని, దీని కోసం ఇంధన శాఖ ఉత్పత్తి, ప్రసారం మరియు పంపిణీ కార్యకలాపాలను క్రమానుగతంగా సమీక్షిస్తున్నట్లు ఆయన చెప్పారు.

పర్యాటక ప్యాకేజీల్లోకి ఆర్టీసీ ఎంట్రీ!

• ఇప్పటికే ప్రయోగాత్మక ప్రాజెక్టులు
• అరకు, పాడేరుకు విశేష స్పందన
• ఊటీ టూర్‌కు మంచి ఆదరణ
• ఏపీటీడీసీ సహకారం కోరుతున్న అధికారులు
• ఓకే అయితే మరిన్ని డిపోల నుంచి బస్సులు

అమరావతి, ఆంధ్రప్రభ: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ(ఏపీఎస్ ఆర్టీసీ) పర్యాటక రంగంలోకి ఎంటర్ అవుతోంది. వారాంతపు రోజుల్లో భిన్నమైన ప్రాంతాలకు వెళ్లాలనే సందర్శకుల ఆకాంక్షలకు అనుగుణంగా ఆర్టీసీ సర్వీసులు నడిపేలా కార్యాచరణ రూపొందిస్తోంది. పర్యాటకాభివృద్ధి సంస్థ అమలు చేస్తోన్న టూరిజం ప్యాకేజీ తరహాలోనే ప్రయాణికుల కోసం ప్రత్యేక సౌకర్యాలను ప్రవేశపెడుతోంది. ఇప్పటికే చేపట్టిన ప్రాజెక్టులకు ప్రయాణికుల నుంచి మంచి ఆదరణ లభిస్తోంది. కొంతకాలంగా పవిత్ర పుణ్యక్షేత్రాలకు ప్రత్యేక సర్వీసులను ఆర్టీసీ నడుపుతోంది. తమిళనాడులోని అరుణాచలానికి రాష్ట్రంలోని పలు డిపోల నుంచి బస్సులను నడిపిస్తోంది. ఇదే సందర్భంలో వేలాంకిణికి స్పెషల్ సర్వీసులను అందుబాటులోకి తీసుకొచ్చింది. ప్రత్యేక పర్వదినాల్లో పుణ్యక్షేత్రాలకు స్పెషల్ సర్వీసులను నడుపుతుండటంతో ప్రయాణికులు, భక్తుల నుంచి పెద్ద ఎత్తున స్పందన వస్తోంది. ముఖ్యంగా అరుణాచలం బస్సులకు ప్రత్యేక ఆదరణ వస్తున్నట్లు అధికారులు చెపుతున్నారు. ప్రతి నెలా పౌర్ణమి రోజుల్లో నడిపే సర్వీసులకు విశేష స్పందన రావడంతో డిపోలు పోటీలు పడీ బస్సులు నడుపుతున్నాయి. ఇదే క్రమంలో ఇటీవల పర్యాటక ప్రాంతాలపై కూడా ఆర్టీసీ ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టిసారించారు. ఇప్పటికే కొన్ని పర్యాటక ప్రాంతాలకు నడుపుతున్న సర్వీసులకు మంచి రెస్పాన్స్ వస్తున్నట్లు అధికారులు చెపుతున్నారు. పర్యాటకుల నుంచి ఆదరణ నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని పర్యాటక ప్రాంతాలకు ప్రత్యేక సర్వీసుల నిర్వహణపై అధికారులు దృష్టిసారించారు. ఇందుకోసం ప్రత్యేక ప్యాకేజీలు రూపొందించడంపై కసరత్తు చేస్తున్నారు.

ప్రయోగం సక్సెస్..

రాష్ట్రంలో పెద్ద ఎత్తున పర్యాటక ప్రాంతాలు ఉన్నాయి. సముద్ర తీరాలు, నదీ పరివాహక ప్రాంతాలు, చారిత్రక నేపథ్యం ఉన్న కోటలు, బౌద్ధ ఆరామాలు..ఇలా ప్రతి జిల్లాలోను పర్యాటక ప్రాంతాలు అన్ని జిల్లాల్లో విస్తరించి ఉన్నాయి. ఇప్పటికే వివిధ ప్రాంతాలకు ఆంధ్రప్రదేశ్ పర్యాటకాభివృద్ధి సంస్థ(ఏపీటీడీసీ) ప్రత్యేక ప్యాకేజీలు ప్రకటించి అమలు చేస్తోంది. ఇదే తరహాలో ఆర్టీసీ కూడా ప్రత్యేక టూర్ ప్యాకేజీలపై ప్రయాణికులను సందర్శనీయ ప్రాంతాలకు తీసుకెళ్లనుంది. ఎంపిక చేసిన పర్యాటక ప్రాంతానికి మధ్యలోని ఇతర దర్శనీయ ప్రాంతాలను కలిపేలా ప్యాకేజీలు రూపొందిస్తున్నారు. విజయవాడ నుంచి అరకు, పాడేరు ప్రాంతాలకు ఇటీవల ప్రత్యేక ప్యాకేజీపై టూర్ ఏర్పాటు చేశారు. వారాంతపు వేళల్లో నిర్వహిస్తున్న పర్యాటక ప్యాకేజీలు పెద్ద ఎత్తున సందర్శకులను ఆకట్టుకుంటున్నాయి. ఇప్పటికే మూడు ట్రిప్పులు నడిపినట్లు అధికారులు చెపుతున్నారు. ఇటీవల మదనపల్లి నుంచి ఊటీకీ పర్యాటక బస్సులను నడుపుతోంది. ఈ నెల 10 నుంచి ఊటీకి స్పెషల్ సర్వీసులు ప్రారంభించారు. మదనపల్లి డిపో అధికారులు శ్రీకారం చుట్టారు. రాత్రి మదనపల్లి నుంచి బయలుదేరి మరుసటి రోజు ఉదయం 8గంటలకు ఊటీ చేరుకునేలా ఏర్పాట్లు చేశారు. ఇదే క్రమంలో మార్గ మధ్యంలో పలు పర్యాటక ప్రాంతాలను సందర్శిస్తూ తిరిగి రాత్రి బయలుదేరాల నిర్ణయించారు. మిగిలిన డిపోల నుంచి కూడా సమీప, ప్రత్యేక సందర్శన స్థలాలకు టూర్ ప్యాకేజీలు నిర్వహించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు.

పర్యాటక సహకారం..

ఆర్టీసీ పర్యాటక ప్యాకేజీలకు పెద్ద ఎత్తున స్పందన వస్తున్న నేపథ్యంలో సందర్శకుల విశ్రాంతి, ఆహార పదార్థాలు తీసుకోవడం వంటి అంశాలపై అధికారులు దృష్టిసారించారు. ఆర్టీసీ ప్రవేశ పెట్టిన పర్యాటక టూర్లు రూ.2000 నుంచి రూ.2500 మధ్య ఉంటున్నాయి. అతి తక్కువ ఖర్చుతో అరకు, పాడేరు, ఊటీ వంటి ప్రత్యేక ప్రాంతాలకు ఆర్టీసీ సర్వీసులు నడుపుతోంది. పర్యాటకులకు ఇతర ఖర్చులను కూడా తగ్గించే క్రమంలో పర్యాటక శాఖ అధికారుల సహకారం తీసుకునే ప్రయత్నాల్లో ఉన్నారు. ఏపీటీడీసీ ప్రవేశపెట్టే ప్యాకేజీలతో నిమిత్తం లేకుండా తక్కువ ఖర్చుతో బ్యాక్ ఎండ్(వసతి తదితర) సహకారం అందించాలని అధికారులను కోరుతున్నారు.

వాణిజ్య, పారిశ్రామికాభివృద్ధితో సమాజాభివృద్ధి

• ఆర్థిక శాఖా మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్

అమరావతి, ఆంధ్రప్రభ : వాణిజ్యం, పారిశ్రామికాభివృద్ధితోనే సమాజం అభివృద్ధి చెందుతుందని ఆర్థిక, ప్రణాళిక, వాణిజ్య పన్నులు,నైపుణ్యాభివృద్ధి, శిక్షణ శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ వెల్లడించారు.వాణిజ్య, పారిశ్రామిక రంగాల్లో రాణించాలంటే నైపుణ్యం అవశ్యమని ఆయన స్పష్టం చేశారు.అభివృద్ధి చెందిన దేశాలతో పోటీగా ఏపీలో నైపుణ్య, శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. విశాఖపట్నం వేదికగా శుక్రవారం జరిగిన ఫ్యాప్సీ ఎక్సలెన్స్ అవార్డ్స్ 2022-23 కార్యక్రమంలో మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఆంధ్రప్రదేశ్‌లో స్థిరమైన పారిశ్రామిక పర్యావరణ వ్యవస్థను సృష్టించడంపై ప్రసంగించారు. స్కిల్ హబ్స్ ద్వారా వేలాది మంది యువతకి పరిశ్రమలకు అవసరమైన నైపుణ్య శిక్షణ అందించి ఉద్యోగావకాశాలు పెంచుతున్నట్లు మంత్రి బుగ్గన వివరించారు. నైపుణ్య, శిక్షణను 4 విభాగాలుగా విభజించి స్థానిక వాతావరణం, అవకాశాలకు తగ్గ రంగాలలో యువతను సంసిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. విశాఖలో మెరైన్, షిప్పింగ్ ఆధారిత సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్, అనకాపల్లిలో ఎమ్ఎస్ఎమ్ఈ శిక్షణ కేంద్రం వంటివాటిని వాటిని యువతకు మరింత ఉపయోగపడేలా తీర్చిదిద్దినట్లు మంత్రి బుగ్గన స్పష్టం చేశారు. ఈ ఏడాదిలో గతంలో ఎన్నడూ లేనంతగా ఐటీఐ కళాశాలల మౌలికవసతులు, అభివృద్ధి కోసం తొలిసారి రూ.60 కోట్లు బడ్జెట్ లో కేటాయించామన్నారు. పరిశ్రమల సీఎస్ఆర్ నిధులలో పారిశ్రామికాభివృద్ధి, నైపుణ్య శిక్షణ రంగానికి ప్రాధాన్యతనిస్తే యువతకు మంచి భవిష్యత్ అందించినట్లవుతుందని తెలిపారు.

ఎస్సీ గురుకుల టీచర్ల వేతనాలు పెంపు

సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి నాగార్జున

అమరావతి, ఆంధ్రప్రభ : ఎస్సీ గురుకులాల్లో పని చేస్తున్న పార్ట్ టైమ్ టీచర్ల వేతనాలను పెంచుతూ ఉత్తర్వులు జారీ చేసినట్లు సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగు నాగార్జున శుక్ర వారం మీడియాకు వెల్లడించారు. తద్వారా1791 మందికి ప్రయోజనం చేకూరుతుందన్నారు. టీచర్లర్లు, వ్యాయామ ఉపాధ్యాయులు, హెల్త్ సూపర్ వైజర్ల వేతనాలను కూడా పెంచామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న బీఆర్ అంబేద్కర్ ఎస్సీ గురుకులాల్లో పని చేస్తున్న జూనియర్ లెక్చరర్లు, పీజీటీలు, టీజీటీలు, పీఇటీలు, హెల్త్ సూపర్ వైజర్లు వేతనాలను పెంచాలంటూ ఉపాధ్యాయులు చేసిన విజ్ఞప్తి మేరకు బోర్డ్ ఆఫ్ గవర్నర్స్ సమావేశంలో చర్చించి ఈ మేరకు నిర్ణయం తీసుకున్నామన్నారు. 2019 తర్వాత పార్ట్ టైమ్ టీచర్లు, ఇతర సిబ్బంది వేతనాలను పెంచడం ఇదే ప్రథమం అని మంత్రి చెప్పారు.

ఏజెన్సీ ఆర్గానిక్ కాఫీకి అంతర్జాతీయ డిమాండ్

• కాఫీ గింజల సేకరణ ధర పెంచిన జీసీసీ
• త్వరలో ఇంటిగ్రేటెడ్ ప్రాసెసింగ్ యూనిట్

అమరావతి, ఆంధ్రప్రభ : రాష్ట్రంలోని మన్యం గిరిజన ప్రాంతంలో పండిస్తోన్న కాఫీకి అంతర్జాతీయ మార్కెట్లో గిరాకీ పెరుగుతోంది. ఈ నేపథ్యంలో గిరిజనుల నుంచి సేకరించే కాఫీ పరిమాణం పెంచాలనే, దానికయ్యే ప్రాసెసింగ్ ఖర్చును తగ్గించుకోవాలనే యోచనలో గిరిజన సహకార సంస్థ (జిసిసి) ఉంది. పాడేరు ఏజెన్సీలో గిరిజన రైతులు పండిస్తున్న కాఫీని భవిష్యత్తులో ఎక్కువ మొత్తంలో సేకరించేందుకు ప్రణాళికలు రూపొందించింది. గతేడాది (2022-23) ప్రయివేటు వ్యాపారుల కంటే ఎక్కువ ధర చెల్లించింది. ఎక్కువ పరిమాణంలో కాఫీని కొనుగోలు చేసింది. మంచి ఫలితాలు సాధించింది. 2021-22 ఆర్థిక సంవత్సరంలో 150 టన్నుల కాఫీని సేకరించిన జిసిసి 2022-23 ఆర్థిక సంవత్సరంలో రూ.20 కోట్ల విలువైన వెయ్యి టన్నులు కొనుగోలు చేసింది. అంతర్జాతీయ మార్కెట్లో ఏజెన్సీలోని ఆర్గానిక్ కాఫీకి మంచి డిమాండ్ ఉంది. దీంతో, గిరిజనులకు చెల్లించే ధర పెంచి కొనుగోలు చేసినా, జిసిసి ఆర్థిక పరిస్థితి ఆశాజనకంగానే ఉంది. గత ఏడాది పార్చుమెంట్ కాఫీ కిలోకు రూ.285, చెర్రీ కాఫీ కిలోకు రూ.145 చొప్పున చెల్లించింది. రూ.20 కోట్ల టర్నోవర్‌తో సాధించిన కోటిన్నర లాభంలో రూ.50 లక్షలు వరకు సిఎస్ఆర్ కింద కాఫీ గింజలు ఆరబెట్టుకోవడానికి టార్పాలిన్లను గిరిజనులకు అందజేయాలని ఆలోచిస్తోంది.కాఫీ ప్రాసెసింగ్‌కు పెడుతున్న ఖర్చును తగ్గించు కొనేందుకు డౌనూరులో ఇంటిగ్రేటెడ్ ప్రాసెసింగ్ యూనిట్ ను పెట్టేందుకు జిసిసి ప్రయత్నిస్తోంది. ప్రాసెసింగ్, రోస్టింగ్, గ్రైండిగ్ చేయడం ద్వారా ప్రాసెసింగ్ ఖర్చు తగ్గించుకోవ డానికి ప్రణాళికలు రూపొందించింది. కాఫీకి మార్కెట్లో మంచి ధర, మరింత నాణ్యమైన కాఫీని అందుబాటులోకి తీసుకురావడానికి ప్రయత్నిస్తోంది. యూనిట్ ఇక్కడ ప్రారం భిస్తే స్థానిక గిరిజనులకు ఉపాధి లభిస్తుంది. బెంగళూరులో ప్రాసెసింగ్ చేయాల్సిన అవసరం ఉండదు. తద్వారా ఖర్చు తగ్గించుకోవాలని, కాఫీ పండిస్తున్న గిరిజనులకు లాభాలను వివిధ రూపాల్లో ఇవ్వాలని జిసిసి యోచిస్తోంది. ఎరువులు ఉపయోగించకుండా పండిస్తున్న కాఫీకి జిసిసి ఆర్గానిక్ సర్టిఫికేషన్ ఇస్తోంది. ఇప్పటివరకు చింతపల్లి మండలంలోని 2,210 ఎకరాలు, జికె.వీధి మండలంలోని 3,435 ఎకరాల్లో కాఫీ సాగు చేస్తున్న 1300 మంది రైతులకు చొప్పున ఆర్గానిక్ సర్టిఫికేషన్ ఇచ్చింది. డౌనూరులో ఐదెకరాల స్థలంలో నాలుగు కోట్ల విలువైన కాఫీ ఇంటిగ్రేటెడ్ ప్రాసెసింగ్ యూనిట్‌ను వీలైనంత తొందరగా ఏర్పాటు చేస్తామని జిసిసి ఎమ్‌డి జి.సురేష్ కుమార్ తెలిపారు. ప్రభుత్వం నుంచి అనుమతి వచ్చిన వెంటనే టెండర్లు పూర్తి చేసి పనులు ప్రారంభిస్తామన్నారు. ఈ యూనిట్ వల్లకాఫీ గ్రేడింగ్‌లో మరింత నాణ్యత పెరిగి అంతర్జాతీయ మార్కెట్లో కాఫీకి గిరాకీ పెరుగుతుందన్నారు. జిసిసికి ప్రాసెసింగ్ ఖర్చు తగ్గుతుంది. వచ్చిన లాభాలను కాఫీ రైతుల అవసరాలకు వినియోగించవచ్చునని సురేష్ కుమార్ వెల్లడించారు.

ఏపీ విపత్తు నిర్వహణ సంస్థ పనితీరు భేష్

• గ్రేటర్ హైదరాబాద్‌లో ఇదే విధానాన్ని అమలు చేస్తాం
• డిజాస్టర్ మేనేజ్‌మెంట్ ఎన్.ప్రకాష్ రెడ్డి



అమరావతి, ఆంధ్రప్రభ : ప్రజా శ్రేయస్సుదృష్ట్యా అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని అమలు చేస్తున్న ఆంధ్రప్రదేశ్ విపత్తుల నిర్వహణ సంస్థ పనితీరు భేష్ అని గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్‌ఫోర్స్‌మెంట్, విజిలెన్స్ అండ్ డిజాస్టర్ మేనేజ్మెంట్ డైరెక్టర్ ఎన్ ప్రకాష్ రెడ్డి కితాబిచ్చారు. తాడేపల్లి లోని విపత్తు నిర్వహణ సంస్థ కార్యాలయాన్ని శుక్రవారం గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్‌ఫోర్స్‌మెంట్, విజిలెన్స్ అండ్ డిజాస్టర్ మేనేజ్మెంట్ డైరెక్టర్ ఎన్ ప్రకాష్ రెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా విపత్తుల సంస్థ అవలంబిస్తున్న అనేక సాంకేతికత పరిజ్ఞానాల గురించి మేనేజింగ్ డైరెక్టర్ డా.బి.ఆర్ అంబేద్కర్ వివరించారు. స్టేట్ ఎమర్జన్సీ ఆపరేషన్ సెంటర్ లో 24/7 వాతావరణాన్ని పర్యవేక్షించే విధానాన్ని తెలియజేసారు. తుపాన్లు, వరదలు, వడగాల్పులు, భారీవర్షాలు, పిడుగుపాటు హెచ్చరిక సమాచారాన్ని జిల్లాయంత్రాంగానికి, ప్రజలకు పంపించే వ్యవస్థను వివరించారు. వాతావరణ పరిశోధన విభాగాలలోని వివిధ అంశాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎన్.ప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ, ప్రజల శ్రేయస్సుకు అధునాతన పరిజ్ఞానాన్ని అమలు చేస్తున్న ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ పనితీరును ప్రత్యేకంగా అభినందించారు. ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ వినియోగిస్తున్న టెక్నాలజీను గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్లో విపత్తు/అత్యవసర పరిస్థితులను సమర్థవంతంగా నిర్వహించ డానికి ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ లో అమలు చేయడానికి చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ ఎగ్జిగ్యూటివ్ డైరెక్టర్ డా.సి.నాగరాజు, వాతావరణ నిపుణులు ఎం.ఎం అలీ, ఇంచార్జ్ సిహెచ్ శాంతిస్వరూప్ పాల్గొన్నారు.

కేంద్రం అనుమతిస్తే స్టీల్‌ప్లాంట్‌ను కాపాడుకుంటాం

• జూన్ 4 తర్వాత ఆమరణ నిరాహార దీక్ష చేస్తా

విశాఖపట్నం, ప్రభన్యూస్: విశాఖస్టీల్ ప్లాంట్‌నుకాపాడుకునేందుకు కేంద్ర ప్రభుత్వం అనుమతిస్తే ప్రైవేటీకరణ కాకుండా నిలిపేందుకు అవసరమైన నాలుగువేల కోట్లు సిద్ధంగా ఉన్నాయని ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్ అన్నారు. విశాఖలోని కేఏ పాల్ ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ విషయంపై స్పష్టమైన హామీ ఇవ్వాలని జూన్4వ తేది వరకూ సమయం ఇచ్చామని, అప్పటికీ ఖచ్చితమైన హామీ రాకపోతే ఆ తర్వాత నుంచి అమరణ నిరాహార దీక్షచేపడతామన్నారు. స్టీల్‌ప్లాం ట్‌ను కాపాడలేని, ప్రధాని మోడీని ప్రశ్నించలేని నాయకులంతా నేడు గొప్పలు చెప్పడం సరికాదున్నారు. ఆంధ్ర రాష్ట్రాన్ని టీడీపీ హయాంలో చంద్రబాబు, వారి మిత్రబృందం రాబంధువుల్లా దోచుకున్నారని, నేడు అధికారంలోకి వచ్చిన సిఎం జగన్ అదే విధానాన్ని కొనసాగిస్తున్నారన్నారు. ప్రస్తుతం ఏపీలో ప్రభుత్వం అప్పులకు వడ్డీకట్టలేని పరిస్థితి నెలకొందన్నారు. వచ్చే ఎన్నికల్లో ప్రజాశాంతి పార్టీని గెలిపిస్తే ఉచితవిద్య, వైద్యం, రైతుల అండగా ఉంటామన్నారు. ఇప్పటికే సీబీఐ మాజీ జాయింట్ డైరెక్టర్ వీవీ లక్ష్మీనారాయణను సైతం ప్రజాశాంతి పార్టీలో చేరామన్నారు. ఏపీ, తెలంగాణ ఎన్నికల్లో అన్ని స్థానాల్లో పోటీ చేస్తామనీ ధీమా వ్యక్తం చేశారు.

గోవిందరాజులు ఆలయ మహాసంప్రోక్షణ ఆపలేం

• అక్రమాలపై సంబంధిత వేదికలను ఆశ్రయించండి
• పిటిషన్లను తోసిపుచ్చిన హైకోర్టు

అమరావతి, ఆంధ్రప్రభ: తిరుపతి శ్రీ గోవిందరాజు స్వామి ఆలయ సంప్రోక్షణను నిలువరించలేమని హైకోర్టు స్పష్టం చేసింది. ఆలయ గర్భగుడి విమాన గోపురంపై బంగారు తాపడంతో రాగి రేకుల ఏర్పాటులో జరిగిన అక్రమాలపై సంబంధిత వేదికలను ఆశ్రయించాలని సూచిస్తూ పిటిషన్లను కొట్టేసింది. గోపురం పూత వ్యవహారంలో అనేక అక్రమాలు చోటు చేసుకున్నాయని దీన్ని విచారించేందుకు ఈనెల 21వ తేదీన నిర్వహించే మహా సంప్రోక్షణను నిలుపుదల చేయాలని కోరుతూ దాఖలైన పిటిషన్లపై హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బీఎస్ భానుమతి శుక్ర వారం మరోసారి విచారణ జరిపారు. రాగి రేకులకు బంగారు పూతకు బదులుగా రంగులు వేస్తున్నారని పిటిషనర్ తరుపు న్యాయవాది జేవీ ఫణిదత్ కోర్టుకు వివరించారు. రాగిరేకులు సగమే ఏర్పాటు చేసి సొమ్ము చేసుకుంటున్నారని తెలిపారు. పనుల్లో భాగంగా గోపురంపై ఉన్న విగ్రహాలను ధ్వంసం చేశారని కోర్టుకు నివేదించారు. టీటీడీ తరపు సీనియర్ న్యాయవాది ఎస్ సత్యనారాయణప్రసాద్ స్పందిస్తూ ఇందులో ఎలాంటి అక్రమాలు జరగలేదన్నారు. మహా సంప్రోక్షణ పూర్తయినా డ్రోన్ల సాయంతో పరిశీలన జరుపుకునే వీలుంటుం దన్నారు. ఈ విషయంలో ఎలాంటి మధ్యంతర ఉత్తర్వులను జారీ చేయరాదని కోరారు. ఈ వాదనలతో న్యాయ మూర్తి ఏకీభవిస్తూ మధ్యంతర ఉత్తర్వుల జారీకి నిరాకరిస్తూ పిటిషన్లను త్రోసిపుచ్చారు.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము
గ్రామీణ నీటి సరఫరా మరియు పారిశుధ్య శాఖ
ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన
నిట్ నెం. 1 టూ 30/2023-24 తేది: 16-05-2023
తిరుపతి జిల్లా, సత్యవేడు గ్రా.నీ.స & పారిశుధ్య విభాగమున గడప గడపకు మన ప్రభుత్వం క్రింద మంజూరైన 30 పనులకు గాను అంచనా విలువ: రూ.51.00 లక్షలకు టెండర్లు కోరబడుచున్నవి. టెండర్లు స్వీకరణ ప్రారంభ తేది: 23-05-2023న మ॥3.00గం.ల నుండి వివరాలు www.apeprocurement.gov.in ఫోన్: 9100121873.
సం/- ఉప కార్యనిర్వాహక ఇంజనీర్, గ్రా.నీ.స. & పారిశుధ్య విభాగము, సత్యవేడు-1
Ro.No. 9531/CL/Advt/1/1/2021-22, Dt: 19.05.2023

వృద్ధ దంపతుల ఆత్మహత్య

• ఆస్తికోసం అన్నదమ్ముల గొడవతో మనస్థాపం

మదనపల్లి క్రైమ్ ప్రభన్యూస్: అన్నదమ్ములతో తలెత్తిన ఆస్తి గొడవల కారణంగా విషం తాగి వృద్ధ దంపతుల ఆత్మహత్య చేసుకున్న విషాదకర సంఘటన మదనపల్లి అనప గుట్టలో గురువారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. ప్రతి కుటుంబ సభ్యులు టూ టౌన్ పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. తంబళ్లపల్లి మండలం గుండుపల్లి పంచాయతీ, మొరుసువాని బురుజు పల్లికి చెందిన గుట్టపాలెం నరసింహులు నాయుడు(70), పదేళ్ల క్రితం బ్రతుకు తెరువు నిమిత్తం భార్య వెంకటసుబ్బమ్మ(60)తో కలిసి తన ముగ్గురు పిల్లలతో మదనపల్లి అనప గుట్టకు వచ్చి స్థిరపడ్డాడు. వృద్ధులు చిల్లర దుకాణం నిర్వహిస్తూండగా, పిల్లలు పెళ్లిళ్లు చేసుకుని అదే ప్రాంతంలో వేరు వేరుగా కూలి మగ్గాలు నేసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో నరసింహులు నాయుడు తన తమ్ముళ్లు చిన్న నరసింహులు నాయుడు, అప్పలనాయుడుకు వారసత్వ ఆస్తిని తమ్ముళ్లకు భాగ పరిష్కారాలు చేయలేదని రెండేళ్లుగా వేధిస్తున్నాడని మనస్తాపంతో అప్పలనాయుడు అన్న నరసింహులు నాయుడు పై తంబళ్లపల్లి పోలీస్ స్టేషన్లో ఈ నెల 17న ఫిర్యాదు చేశాడు. ఈ విషయమై పోలీసులు నరసింహులు నాయుడుకు ఫోన్ చేసి స్టేషన్కు వచ్చి భూ సమస్యను పరిష్కరించుకోవాలని కోరారు. అయితే తాను తన భార్య అనారోగ్యంతో ఉందని, చికిత్సలు చేయించుకుని తిరిగి వస్తానని కొంత వ్యవధి అడిగాడు. పోలీసులు అందుకు ఒప్పుకోక పోవడమే కాకుండా స్టేషన్కు వచ్చి సమాధానం చెప్పాలని ఫోన్ చేయగా మనస్థాపం చెందడం, అప్పటికే భార్య అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటుండడం ఆస్తి రాసిస్తానని అప్పల దగ్గర తీసుకున్న డబ్బులు తిరిగి ఇవ్వలేకపోవడం, ఆస్తి రాసివ్వడానికి మనసు ఇష్టపడక దంపతులు ఇద్దరూ తను ఉంటున్న ఇంటిలోనే కూల్ డ్రింక్‌లో విషం కలుపుకుని తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. స్థానికులు బాధితులను ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందారు. విషయం తెలుసుకున్న రెండవ పట్టణ పోలీసులు. ఘటన స్థలాన్ని పరిశీలించి ఆత్మహత్య చేసుకున్న వారిది తంబళ్లపల్లె మండలంగా నిర్ధారణకు వచ్చారు. అయితే సివిల్ మ్యాటర్లో పోలీసులు తల దూర్చి వేధించారన్న దానిలో వాస్తవం లేదన్నారు. సోషల్ మీడియాలో వచ్చిన వార్తలో వాస్తవం లేదని డి.ఎస్.పి కేశప్ప కొట్టి పారేశారు. అన్నదమ్ముల ఆస్తి గొడవల కారణంగానే వృద్ధ దంపతులు మదనపల్లిలో విషం తాగి ఆత్మహత్య చేసుకున్నారని మీడియా సమావేశంలో డిఎస్పీ తెలిపారు. మృతదేహాలను పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రి ఆసుపత్రి మార్చురీకి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.వృద్ధ దంపతుల ఆత్మహత్యపై విభిన్న కోణాల్లో దర్యాప్తుమదనపల్లిలో వృద్ధ దంపతులు నరసింహులు నాయుడు, వెంకట సుబ్బమ్మ ఆత్మహత్య చేసుకున్న ఘటనపై విభిన్న కోణాల్లో లోతుగా దర్యాప్తు ప్రారంభించినట్లు డిఎస్పికేశప్ప, టూ టౌన్ సీఐ మురళీకృష్ణ తెలిపారు. వేరే ఇతర కారణాలు ఉన్నాయా అన్న దానిపైన కూడా పరిశీలిస్తున్నామని తెలిపారు.

NELCAST LIMITED
CIN : L27109AP1982PLC003518
Regd. Office: 34, Industrial Estate, Gudur - 524 101. Tel : 08624 - 251266.
Fax: 08624 - 252066. Wesite: www.nelcast.com Email: nelcast@nelcast.com
31 మార్చి, 2023తో ముగిసిన త్రైమాసిక మరియు సంవత్సరం కొరకు ఆడిట్ చేసిన స్వతంత్ర మరియు ఏకీకృత ఆర్థిక ఫలితాల యొక్క నివేదిక
(₹ లక్షలలో)

క్ర. సం.	వివరాలు	స్వతంత్ర					ఏకీకృత				
		ముగిసిన 3 నెలలు			ముగిసిన సం॥		ముగిసిన 3 నెలలు			ముగిసిన సం॥	
		31.03.2023	31.12.2022	31.03.2022	31.03.2023	31.03.2022	31.03.2023	31.12.2022	31.03.2022	31.03.2023	31.03.2022
		ఆడిట్ చేసినవి	ఆడిట్ చేయనివి	ఆడిట్ చేసినవి	ఆడిట్ చేసినవి	ఆడిట్ చేసినవి	ఆడిట్ చేసినవి	ఆడిట్ చేయనివి	ఆడిట్ చేసినవి	ఆడిట్ చేసినవి	ఆడిట్ చేసినవి
1	కార్యకలాపాల నుండి మొత్తం ఆదాయం	31517.76	33372.85	27182.14	128011.84	93674.35	31517.76	33372.85	27182.14	128011.84	93674.35
2	పన్నుకు ముందు నికర లాభం (సాధారణ కార్యకలాపాలు మరియు అసాధారణమైన అంశాల నుండి)*	599.22	712.90	837.73	4031.70	1904.99	599.22	712.90	837.73	4031.70	1904.99
3	పన్ను తరువాత నికరలాభం (సాధారణ కార్యకలాపాలు మరియు అసాధారణమైన అంశాల నుండి)*	448.40	533.51	675.50	2973.54	1422.47	448.40	533.51	675.50	2973.54	1422.47
4	పన్ను తరువాత మొత్తం సమగ్ర ఆదాయం	455.19	531.27	630.32	2933.19	1332.39	455.19	531.27	630.32	2933.19	1332.39
5	ఈక్విటీ వాటా మూలధనం (ముఖ విలువ ₹ 2/- చొప్పున పూర్తిగా చెల్లించినది)	1740.02	1740.02	1740.02	1740.02	1740.02	1740.02	1740.02	1740.02	1740.02	1740.02
6	ఇతర ఈక్విటీ (ఆడిట్ చేసిన ఆస్తి అప్పుల పట్టికలో చూపిన విధంగా)				45100.04	42427.85				45100.04	42427.85
7	ప్రతి వాటా ఆర్జనలు ₹ 2/- చొప్పున (త్రైమాసికాల కొరకు ఇపిఎస్ వార్షీకరించబడలేదు)										
	బేసిక్	0.52	0.61	0.78	3.42	1.64	0.52	0.61	0.78	3.42	1.64
	డైల్యూటెడ్	0.52	0.61	0.78	3.42	1.64	0.52	0.61	0.78	3.42	1.64

గమనిక :
1. సెబీ (లిస్టింగ్ ఆబ్లిగేషన్స్ మరియు డిస్‌క్లోజర్ రిక్వైర్‌మెంట్స్) నిబంధనలు 2015 యొక్క 33వ నిబంధన ప్రకారం స్టాక్ ఎక్స్ఛేంజ్‌లతో దాఖలు చేయబడిన ఆర్థిక ఫలితాల సవివర నమూనా యొక్క సారాంశం పైన తెలుపబడినది.
త్రైమాసిక / వార్షిక ఆర్థిక ఫలితాల యొక్క పూర్తి నమూనాలు స్టాక్ ఎక్స్ఛేంజ్ వెబ్‌సైట్‌లు: www.bseindia.com, www.nseindia.com మరియు కంపెనీ వెబ్‌సైట్ www.nelcast.com నందు లభించును.
* కంపెనీ వారికి పై కాలాలలో నివేదించదగిన అసాధారణమైన అంశాలు ఏవీ లేవు.

For Nelcast Limited
P. Deepak
Managing Director
Place : Chennai
Date : 18.05.2023